క్లుప్తంగా

విద్యా పరికరాలు అందజేత

సోంపేట: గొల్లగండి పంచాయతీ చేపల గొల్లగండి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 130 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన గండుపల్లి సోమేశ్వరరావు, గీత దంపతులు అట్టలు, పెన్సిల్ కిట్, బాక్స్‌లను బుధవారం అందజేశారు. మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు చిన్న రాజారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఏక్తా దివస్

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ అధ్యాపకులు ల్యాక్‌పాల్, టి.త్రినాథరావు, డి.వాసుబాబు, గొల్ల, కోటేశ్వరరావు, జగన్నాథ్ బిసై, ధర్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలో డొంకూరు విద్యార్థినుల ప్రతిభ

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాలకు చెందిన వై.భవానీ. డి.మీనా, పి.గీత, బి.ధనలక్ష్మీలు జిల్లా తరఫున 43వ రాష్ట్రస్థాయి సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొని రజిత పతకాన్ని గెలుపొందారు. ఈ విషయాన్ని హెచ్ఎం జె.సరోజని తెలిపారు. శ్రీకాళహస్తి వేదికగా ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయులు వజీర్ అహ్మద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సత్యసాయి విద్యార్థులు

ఎం.తోటూరుకు చెందిన సత్యసాయి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్, క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం కిరణ్‌కుమార్ లిమ్మాయి తెలిపారు.

అలరించిన గణిత అవధానం



అవధానం నిర్వహిస్తున్న విద్యార్థిని ఉలాల నందు

కంచిలి: సువాగడ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి అధ్యక్షతన బుధవారం గణిత అవధానం, మేధా సంపత్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా గణిత అవధాని మద్దు తిరుపతిరావు వ్యవహరించారు. చొత్రాయిపురం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఉలాల నందు అవధానం అంశాలు, ఘన మూలం, వార గణన, గణిత చదరం, మనో సంకలనం తదితర అంశాలు విద్యార్థుల్లో ఆసక్తి కలిగించాయి. ఈ సందర్భంగా అవధాని తిరుపతిరావు, బాల మేధావి ఉలాల నందును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి జ్ఞాపికలతో సత్కరించారు.

నిరుపేదకు ఆర్థిక సాయం

కవిటి: కవిటి మండపం వీధికి చెందిన పోల్లాయి మండల కుమారి కడుపులో కణితి తయారై క్యాన్సర్‌గా మారింది. నిరుపేద కావడంతో వైద్యం కోసం డబ్బుల్లేక అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు రూ. 26 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని కుమారికి బుధవారం అందించారు. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాండవ శేఖర్, మొగిలిపురి సీతారాం పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించాలి

సోంపేట: సోంపేట సర్కిల్ పరిధిలోని మద్యం షాపుల్లో నియమ నిబంధనలు పాటించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బేబి అన్నారు. సర్కిల్ పరిధిలోని 12 మంది మద్యం లైసెన్స్‌దారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, లూజ్ సేల్స్, బ్రాండ్ మిక్సింగ్ చేయరాదని, బెల్ట్ షాపులకు మద్యం అందించడం చేయకూడదన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం గ్రామంలో రూ.14 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఉపాధి హామీ పథకం పీడీ బి.సుధాకారరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఉపాధి పనులతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున మెటీరియల్ కాంపోనెంట్ పనులను చేపడుతున్నామన్నారు. ఏపీవో నారాయణ రావు, ఈసీ అమ్మినాయుడు ఉన్నారు.

ప్రజలే టీడీపీ నాయకులకు బుద్ధి చెబుతారు

టెక్కలి: అధికారం వచ్చింది కదా అని నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదని టెక్కలి పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సత్తారు సత్యం టీడీపీ నాయకులపై మండిపడ్డారు. ఇటీవల ప్రకాశం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శశికాంత్ భూషణ్ వివాదాస్పదంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. అధికారం వచ్చింది కదా అని నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే తరువాత ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. గ్రామ సచివాలయాలు టీడీపీ నాయకుల జాగీర్ కాదన్నారు.

రూ. లక్ష విరాళం



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్నపూర్ణ సేవా కార్యక్రమానికి టెక్కలికి చెందిన నానుబోలు కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు విరాళంగా బుధవారం అందజేశారు. సేవా సమితి సభ్యులు లలిత, బి.నరసింహమూర్తి, చంటి, బి.అన్నపూర్ణమ్మ, ఎస్.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

–టెక్కలి

నిరుపయోగంగా..



ఇచ్ఛాపురం మండల విద్యావనరుల కేంద్రం వెనుక ఉన్న ఎస్సీ వసతి గృహ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో వసతి గృహాలను ఎత్తివేడంతో ఇచ్ఛాపురంలో ఉన్న ఏకైక ఎస్సీ వసతి గృహాన్ని కూడా ఎత్తివేశారు. దీంతో నేటికి పదేళ్లు దాటుతున్నా ఆ భవనాలు వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి..



టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని కొన్ని చోట్ల ఫ్యాన్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రసూతి విభాగం వెలుపల రోగులను చూసేందుకు వచ్చిన వారి బంధువులు ఉండే ప్రాంతంలో ఫ్యాన్లు లేవు. అలానే వైద్యులు ఉండే గదులకు వెలుపల రోగుల క్యూలైన్‌లలో ఉన్న ప్రదేశాల్లో సైతం ఫ్యాన్లు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

స్నేహితుడికి అండగా..



సోంపేట మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తెలుకుల ప్రేమ్‌కుమార్ కుమారుడు ప్రశాంత్ డాబా పైనుంచి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రేమ్‌కుమార్‌తో పదో తరగతి చదువుకున్న గ్రామానికి చెందిన స్నేహితులు రూ. 10,500 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

–సోంపేట

అడవి పందులు బాబోయ్..!

- వరి, ఇతర పంటలను నాశనం చేస్తున్న వైనం
- నష్టపోతున్న రైతులు



బారువలో అడవిపందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

సోంపేట: రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత కాలంలో పంటల సాగు కష్టంగా ఉంది. పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడం, ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా పంట చేతికందే వరకు నమ్మకం లేకుండా పోయింది. ఏదోలా పంటచేతికందే సమయంలో అడవి పందుల రూపంలో అదనపు సమస్య వచ్చింది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అడవి పందులు బెడద ఎక్కువైంది. ఇవి వరి పంటతోపాటు ఇతర పంటలపై పడి నాశనం చేసి రైతుకు నష్టం కలిగిస్తున్నాయి.

పరిస్థితి ఇలా..

నియోజకవర్గంలో సుమారు 45 వేల ఎకరాల్లో వరి, రెండు వేల ఎకరాల్లో కూరగాయలు, సుమారు 40 వేల ఎకరాల్లో కొబ్బరి, జీడిమామిడి పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటలపై మూకుమ్మడిగా అడవి పందులు దాడి చేసి తినేస్తున్నాయి. కొబ్బరి మొక్కలను నాటితే బయటకు లాగేసి తినేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అడవులు అంతరించి పోతుండడం, ఆహారం, నీటి సమస్య రావడంతో అడవి పందులతోపాటు కోతులు, కొండముచ్చులు గ్రామాల్లోకి సైతం వచ్చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి.

అడవి పందుల నుంచి రక్షణ ఇలా..

అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు రక్షణ చర్యలు చేపట్టాలని సోంపేట మండల వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి రైతులకు సూచించారు.

- 200 గ్రాముల ఫ్లోరైట్/గుళికలు/థిమ్మెట్ గుళికలను కిలో ఇసుకలో కలిపి గుడ్డ లేదా ప్లాస్టిక్ సంచిలో చిన్న చిన్న మూటలుగా కట్టాలి. వీటికి చిన్న రంధ్రాలు చేసి పొలం చుట్టూ ఒక అడుగు దూరంలో మూడు మీటర్లకు ఒకటి చొప్పున కర్రలు పాతి 60–100 సెంటీమీటర్ల ఎత్తులో సంచులను వాటికి కట్టాలి. గుళికల వాసనకు అడవి పందులు రాకుండా ఉంటాయి.
- అలాగే కుళ్లిన కోడిగుడ్డు ద్రావణం పంట పొలం చుట్టూ పిచికారీ చేయవచ్చు. కుళ్లిన లేదా మూముల కోడి గుడ్లను సేకరించి ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. ద్రావణం 25 మిల్లీలీటర్లకు ఒక లీటరు నీటిని కలిపి పంట పొలం చుట్టూ ఒక అడుగు వెడాల్పులో చదునుచేసి తడి భూమిపై పిచికారి చేసుకోవాలి. పది రోజులకు ఓసారి ఇలా చేస్తే అడవి పందులు పంటల దరిచేరవు.
- మంచాలకు ఉపయోగించే బట్ట నవారును కిరోసిన్ ద్రావణంలో నానబెట్టి రెండు గంటల తర్వాత తీసి ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టిన నవారును పంటపొలం చుట్టూ కర్ర దుంగలు పాతి మూడు వరుసలుగా చుట్టుకోవాలి. కిరోసిన్ వాసనతో అడవి పందులు ఆ ప్రాంతానికి రావడానికి ఇష్టపడవు.
- సింహం, పులి, చిరుత, అడవి కుక్కలు, నక్కలు, తోడేళ్ల గాండ్రిపు శబ్దాలను సెల్, వీడియోలో రికార్డ్ చేసి సునిశితమైన స్పీకర్ల ద్వారా పంట ప్రాంతంలో వినిపిస్తే అడవి పందులు తీవ్రభయాందోళనకు గురై పంట పొలాల నుంచి దూరంగా పోతాయి.

అధికారులు, పాలకులు స్పందించాలి



అడవి పందులతో ఏటా పంటలను నష్టపోతున్నాం. అటవీ శాఖ అధికారులు, పాలకులు స్పందించాలి. వరి పంటతో పాటు కాయగూరలు పంటలు, కొబ్బరి మొక్కలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న అడవి పందుల సమస్యను పరిష్కరించాలి. 90 శాతం రాయితీతో సోలార్ కంచెలను రైతులకు అందజేయాలి.

– మేరుగు తిరుపతిరెడ్డి, రైతు, బారువ

పంటలు పండించలేం



అడవి పందుల కారణంగా వరి, కాయగూరల పంటలు సాగు చేయలేకున్నాం. రాత్రి వేళల్లో కాపలా కాయాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు అడవి పందుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవకపోతే పంటలు పండించడం కష్టమే.

–పోకల చిరంజీవులు, రైతు, జింకిభద్ర

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

అడవి పందులు పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయి. ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కరానికి తమవంతు చర్యలు తీసుకుంటాం. రైతులకు న్యాయం చేయడానికి కృషిచేస్తాం.

–రాజేంద్ర, ఫారెస్టు బీట్ ఆఫీసర్, సోంపేట

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం కొత్త మాస్టర్‌ప్లాన్ తయారు చేయుటకు, పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఆరు అంశాలతో ఏజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని బాహుదానది నుంచి రాజుగారి కోట వరకు లైటింగ్ సదుపాయం సమకూర్చాలని, నదివద్ద గల శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని వైస్‌చైర్‌పర్సన్–2 లాబాల స్వర్ణమణి కోరారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నందున ఆ సమస్యను నివారించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వైస్‌చైర్‌పర్సన్–1 ఉలాల భారతిదివ్య, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బి.జగన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. పురపాలకసంఘం ప్రజలు ఇటీవల చాలా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నందున ప్రతీ వార్డులో మెడికల్ క్యాంప్‌లు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసమైన మందులను ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పి.మధుమూర్తి కోరారు. 1, 17 వార్డులో రోడ్లు, కాలువల నిర్మాణాలను చేపట్టాలని కౌన్సిలర్లు సుగ్గ ప్రేమ్‌కుమార్, సీహెచ్ జగన్నాయకులు విజ్ఞప్తి చేశారు.

పోలీసుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం



రక్తదానం చేస్తున్న కాశీబుగ్గ పోలీసులు

కాశీబుగ్గ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలో బుధవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. కళాశాల విద్యార్థులు, పోలీసు సిబ్బంది 22 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సీఐలు డి.మోహన్‌రావు, తిరుపతిరావు, గిరిబాబు, శ్రీనివాసరావు, నారాయణ, జెమ్స్ మేనేజర్ బొడ్డపు చిన్నారావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కవిటి: ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్ కవిటి మండల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్.బెలగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కవిటి మండల మహాసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని కోరారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు ఎన్నికల పరిశీలకులుగా, జిల్లా కార్యదర్శి ఎం.మురళి ప్రకాష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సీనియర్ నేతలు మురళీప్రకాష్, మామిడి శ్రీను, జుదిష్టిరావు, జానకీరావు, కామేష్, కొర్రాయి రామారావు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించపోతే తప్పుకోండి



మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

వజ్రపుకొత్తూరు రూరల్: సక్రమంగా విధులు నిర్వహించలేని ఉద్యోగులు తప్పుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ బి.సుధాకరరావు అన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన ప్రజావేదిక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ జాబ్ కార్డు అందించి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉపాధి సిబ్బంది పనుల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అనంతరం పంచాయితీల వారీగా జరిగిన పనులు, అయిన ఖర్చు, ఇతర వివరాలను సోషల్ అడిట్ సిబ్బంది చదివి వినిపించారు. పలు గ్రామాల్లో మస్తర్లు దిద్దుబాట్లు ఉన్నట్లు వెల్లడించారు. కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోయినట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. వజ్రపుకొత్తూరు బారికి చెరువు పనులకు ఎం.బుక్ లేనందున పనుల్లో తప్పు జరిగినట్లు తెలిపారు. సక్రమైన పనితీరు కనబర్చిన నగరంపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణను అభినందించారు. డీవీవో ఆర్.స్వరూపరాణి, ఏపీడీలు పి.రాధ, ఎం.శైలజ, ఏపీఓ కేశవరావు, సోషల్ అడిట్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సత్కారం

కాశీబుగ్గ: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులు పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయసులోనే ఉద్యోగం పొందిన విద్యార్థులు ఇదే కళాశాలకు చెందిన విద్యార్థులు కావడం అభినందనీయమన్నారు. కెరీర్‌ఎండ్ గైడెన్స్ సెల్ విభాగాధిపతి వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ మధు, ప్లేస్ మెంట్ సెల్‌లో విభాగ అధ్యాపకులు హేమాచలం, కామర్స్ విభాగం అధ్యాపకులు శ్రీనివాస పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను నిర్లక్ష్యం చేయడం తగదు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ స్థాయిలో పంచాయతీ ప్రజా ప్రతినిధులను నిర్లక్ష్యం చేసే విధంగా కార్యక్రమాలను చేస్తున్నారని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.వి.రమణ బుధవారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. పంచాయతీకి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులను పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

ఉద్యోగులకు వృత్యాంతర శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి

కవిటి: వృత్యాంతర శిక్షణను ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులకు, ఉద్యోగులకు శిక్షణను బుధవారం నిర్వహించారు. ఉద్యోగులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఏపీఎం కె.గోవింద్, ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ జ్యోతి పాల్గొన్నారు.

భూ సమస్యల్ని పరిష్కరించుకోండి



భూ సమస్యపై దరఖాస్తు అందిస్తున్న రైతు

కంచిలి: ఇప్పటి వరకు మండలంలో రీ సర్వే చేసిన రెవెన్యూ గ్రామాల్లో రికార్డుల్లో తప్పులు వచ్చిన భూ సమస్యల్ని రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి కోరారు. మఠంసరియాపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పలువురు రైతులు దరఖాస్తులు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, మాదిన రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దీపావళి సందడి..



సోంపేట: రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి వెలుగులు



కవిటిలో దీపావళి సంబరాల్లో చిన్నారులు



ఇచ్ఛాపురం రూరల్: నకాసుర వధను ప్రదర్శిస్తున్న బలరాంపురం విద్యార్థులు

దీపావళి వేడుకలను పలు పాఠశాలల్లో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ, నరకాసురుడు వేషధారణలో అలరించారు. నరకాసురవధను చేపట్టారు. ఈ సందర్భంగా బాణసంచా కాలుస్తూ పిల్లలు సందడి చేశారు. దీపావళి ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు.

–సాక్షి నెట్‌వర్క్